పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చాలని ప్రచారం చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

ప్రభుత్వ బడుల్లోనే విలువలతో కూడిన విద్య

మంగపేట, జూన్ 1: ప్రభుత్వ బడుల్లోనే విలువలతో కూడిన విద్య లభిస్తుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు అన్నారు. యూటీఎఫ్ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిలో నమోదు పెంచి- విద్యారంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఆదివారం చేపట్టిన బైక్ ర్యాలీని ఎంఈవో మేనక జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సమ్మారావు మాట్లాడుతూ సమాజహితం కోసం ప్రభుత్వ బడిలో నమోదు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, కొత్తపేట, తిమ్మంపేట, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, రమణక్కపేట మీదుగా రాజుపేట వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, కోశాధికారి ఎం వెంకటస్వామి, కార్యదర్శి కొండ చెంచయ్య, హెచ్ఎం గడ్డి శ్రీనివాస్, మంగపేట మండల అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు శ్రీనివాస్, నరేశ్, రమేశ్, జోష్టనేశ్వర్, ప్రేమ్ కుమార్, సారయ్య, వెంకటేశ్వర్లు, రమేశ్, రామనాథం, వేణు, విజయకుమారి, మంగవేణి, సతీశ్, ఆస్మా, ఆస్మాబేగం, సునీత, ఏపీసీ చైర్‌పర్సన్ ఊరు అనిత, నళిని పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను విరమించుకోవాలి

ములుగురూరల్, జూన్ 1 : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు అని, ఆ ఉత్తర్వులు విరమించుకోవాలని డీటీఎఫ్ ములుగు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గన్‌రెడ్డి ఆదిరెడ్డి, రేగా నరేంద్రకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాప బాబు దొర ఆదివారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూనే మరో వైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. వేసవిలో ఉపాధ్యాయులు, అధికారులకు శిక్షణ, బడిబాట పేరుతో అనేక కార్యక్రమాలు చేపడుతూనే మరో వైపు పిల్లలు తక్కువగా ఉన్నారన్న ఉద్దేశంతో టీచర్లను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కాటారం, జూన్ 1 : భూ భారతి చట్టం అమలులో భాగంగా మంగళవారం నుంచి కాటారం మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సులో భూ సమస్యలు ఉన్న రైతులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. మంగళవారం బయ్యారం, ఆదివారంపేట, 4న బొప్పారం, దామెరకుంట, 5న చిద్నెపల్లి, ధన్వాడ, 6న చింతకాని, ధర్మసాగర్, 9న దేవరాంపల్లి, గూడూరు, 10న గారెపల్లి, గుమ్మళ్లపల్లి, 11న కంబాలపాడ్, గుండ్రాత్‌పల్లి,12న కాటారం, జాదరావుపేట, 13న కొత్తపల్లి, మల్లారం, 16న మేడిపల్లి, ఒడిపిలవంచ, 17న నస్తూరుపల్లి, రఘుపల్లి, పోచంపల్లి, 18న నల్లగుంట, పోతుల్‌వాయి, రేగులగూడెం, 19న మర్రిపల్లి, ప్రతాపగిరి, వీరాపూర్, 20న సుందరాజ్‌పేట, విలాసాగర్ పంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు ఉంటాయని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడలతో మానసికోల్లాసం

కృష్ణ కాలనీ, జూన్ 1 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి అన్నారు. ప్రపంచ సైకిల్ డేను పురస్కరించుకొని ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో అంబేద్కర్ క్రీడామైదానంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎస్సై సాంబమూర్తి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ ఐశ్వర్య, వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్ : విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించిన భూపాలపల్లి కలెక్టరేట్ భవనం

ములుగు రూరల్ : తంగేడు మైదానంలో చేసిన ఏర్పాట్లు

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరుగనున్న వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉద యం 9:25 గంటలకు ఆయన చెల్పూర్ కేటీపీపీ గోదావరి గెస్ట్ హౌస్ నుంచి అమరవీరుల స్తూపం వద్దకు బయలుదేరుతారని తెలిపారు. 9:35 గంటలకు అమరవీరులకు పుష్పాంజలి ఘటించి, అనంతరం 9:57 గంటలకు ఐడీవోసీ కార్యాలయానికి చేరుకొని పోలీస్ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. సాయంత్రం 3 గంటలకు సుభాష్‌కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గ స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

ములుగు రూరల్ : ముస్తాబైన వేదిక

ములుగు జిల్లాలో..

ములుగురూరల్ : రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. అనంతరం 15 మంది ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందించనున్నారు. అలాగే, పది మంది లబ్ధిదారులకు భూ భారతి పట్టాలను అందించడంతో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన కిట్లను రైతులకు అందించనున్నారు. మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేసి, టీజీపీఎస్సీలో ప్రతిభ చాటిన వారికి ప్రశంసా పత్రాలను అందించనున్నారు. మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కళాకారులు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ బోర్డు

ములుగులో మున్సిపాలిటీ బోర్డు ఏర్పాటు

ములుగురూరల్, జూన్1 : గ్రామ పంచాయతీగా ఉన్న ములుగు మున్సిపాలిటీగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం పాత గ్రామ పంచాయతీ బోర్డును అధికారులు తొలగించారు. ఈ మేరకు పురపాలక సంఘ కార్యాలయం-ములుగు అనే పేరుతో నూతన బోర్డును ఏర్పాటు చేశారు. గత నెల 28న ములుగును మున్సిపాలిటీగా మార్చుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ జీవో విడుదల చేయగా 29 నుండి మున్సిపల్ చట్టాలు ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి పరిధిలోకి వచ్చాయి. 20 వార్డులతో ఏర్పాటైన మున్సిపాలిటీలో కార్యకలాపాలు సోమవారం నుంచి ముమ్మరం కానున్నాయి.

ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ, పోలీసులు

ధ్యానంతో మానసిక శాంతి

ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, జూన్ 1 : ధ్యానం మానసిక శాంతిని కలిగిస్తుందని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో యోగా గురువు ఎర్రంకాని రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం యోగా మహోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి యోగా ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, సీఆర్పీఎఫ్ సీఐ రాంబాబు, పీఎస్సైలు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కేటీపీపీ కానిస్టేబుళ్లు

గణపురం, జూన్ 1 : మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లు ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. 70 మంది కానిస్టేబుల్స్ హెల్ప్ టు నీడ్ అనే గ్రూప్ ఏర్పాటు చేసుకొని పేదలు, విద్యార్థులకు సాయం చేయాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ వారి పిల్లల పుట్టిన రోజు సందర్భంగా రూ.1500 రేషన్ కిట్‌లను సమీప గ్రామాలైన కొంపల్లి, చెల్పూర్, మహబూబ్‌పల్లి, నేరేడుపల్లి, వీరయ్యపల్లి, గొర్లవీడులోని నిరుపేదలకు అందజేస్తున్నారు. గత సంవత్సరం మే నుంచి ఇప్పటి వరకు 32 మంది పేద వితంతువులకు రేషన్ కిట్లు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. పేదలకు సేవలు అందిస్తున్న ఈ కానిస్టేబుళ్లను పలువురు అభినందిస్తున్నారు.

నిరుపేదలకు రేషన్ కిట్లు అందజేస్తున్న కేటీపీపీ కానిస్టేబుళ్లు

బాధిత కుటుంబాలకు సిరికొండ పరామర్శ

టేకుమట్ల/మొగుళ్లపల్లి : టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలో పెద్దవేని రమేశ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట తోట సాగర్, పోతనలయ్య, రాంరెడ్డి, ఉద్దమరి మహేశ్, కార్మిక శాఖ మండల అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణ గౌడ్, యువజన నాయకులు జక్కుల కిరణ్, శంకర్, కిరణ్, అనవేని రమేశ్, రాజయ్య, శీను, రాజిరెడ్డి, భిక్షపతి, వెంకన్న, మహేందర్, శ్రీనివాస్ ఉన్నారు. అలాగే, మొగుళ్లపల్లి మండలంలోని బంగ్లాపల్లి మాజీ సర్పంచ్ కరాబ్ రజిత భర్త కరాబ్ యువరాజ్ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు.

ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు దానవేని రాములు, మాజీ ఉపసర్పంచ్‌లు ఏడాకుల రాజేందర్, దార్ల ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు గోనెల అశోక్, కుమ్మరి సాంబయ్య, బండి కుమార్, గుడిమల్ల రమేశ్, అరికంతపు అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

గణపురం/కృష్ణకాలనీ, జూన్ 1 : గణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96లో 10వ తరగతి పూర్తి చేసిన వారు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు పలుకరించుకుని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఒల్లాల కృష్ణ, కోరే రమేశ్, బాబా, బండి గోపి, మచ్చిక అజయ్, పసునూటి బాలరాజు, బోయిని సాంబయ్య, పద్మ, సునీత, సరిత, శ్రీనివాస్, తమ్మినేని రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, భూపాలపల్లి మండలంలోని శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు కుసుమ కృష్ణమోహన్, రాళ్ల బండి రాజేశం, బానోత్ రాజేందర్, ఆలూరి భాస్కర్, రాము, బాపూను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిక్క ప్రవీణ్, సింగనవేణి చిరంజీవి, మిరియాల మహేందర్, వెన్నంపల్లి నాగరాజు, రాళ్లబండి నిశాంత్, ఏకుల శీను, దుర్గాప్రసాద్, లలిత, కల్పన, లావణ్య, మాధవి, సందవేన, సుధాకర్, వంశీధర్, సది, శోభన్ పాల్గొన్నారు

గణపురం : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కృష్ణకాలనీ : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

4న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ, జూన్ 1 : సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి ఏరియాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బడితల సమ్మయ్య మాట్లాడుతూ కొత్తగూడెంలో జరిగే ధర్నాలో భూపాలపల్లి ఏరియా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు సదానందం, మధు, బ్రాంచ్ నాయకులు బాసనపల్లి కుమార్, వంశీ, నరేందర్, రమేశ్, ఆరెల్లి బాపు, తిరుపతి, అద్వైత్, ప్రవీణ్, పిట్ సెక్రటరీలు నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.

సమ్మక్క దేవత గద్దెను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, జూన్ 1 : వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొదటగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తల్లులకు తలనీలాలను సమర్పించి, గద్దెల వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం గద్దెల పరిసరాలతో పాటు చిలకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు ప్రాంతాలలో విడిది చేసి, కుటుంబ సమేతంగా విందు భోజనాలు చేశారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు.

ఆలయాల్లో విగ్రహ పునఃప్రతిష్ఠ

టేకుమట్ల, జూన్ 1 : మండలంలో అంకుషాపూర్, సోమనపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పూజలో పాల్గొన్న మధుసూదనాచారి

నలుగురు పోలీస్ అధికారులకు సేవా పతకం

అభినందించిన ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, జూన్ 1 : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పోలీసుశాఖలో పనిచేసిన వారికి సేవా పతకాలను ప్రకటించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉత్తమ విధులు నిర్వర్తించిన రేగొండ ఎస్సై ఎండీ షెహాఖాన్, ఏఎస్సై బీ రవీందర్‌రెడ్డి, భూపాలపల్లి ఏఆర్ ఎస్సై బీ సతీశ్, మొగుళ్లపల్లి హెడ్ కానిస్టేబుల్ ఏ శ్రీనివాస్‌కు సేవా పతకాలు వరించాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆయా పోలీస్ అధికారులను ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

'మాజీ సైనికుల సంక్షేమం పట్టని ప్రభుత్వం'

కృష్ణ కాలనీ, జూన్ 1 : రాష్ట్రంలో మాజీ సైనికులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బెతోజు మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్ష మంది మాజీ సైనిక కుటుంబాలు వివక్షకు గురవుతున్నాయని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సంక్షేమ పథకాలకు తెలంగాణ ప్రభుత్వం మంగళం పాడుతోందని ఆరోపించారు. ఇకనైనా మాజీ సైనికుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని మురళీకృష్ణ డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

కాజీపేట, మే 1 : హనుమకొండ జిల్లాలోని ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీ కొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. కాజీపేట జీఆర్పీ సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్ సమీపంలో దాదాపు 30ఏళ్ల ఉన్న వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందగా మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా, మృతుడు చల్లగరిగె గ్రామానికి చెందిన జనగాం మహేశ్ అని, ప్రస్తుతం జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో డిప్యూటీ స్టేషన్‌మాస్టర్‌గా పని చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

ములుగురూరల్, జూన్ 1 : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ సారి రద్దు చేసినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

అడవిలో ప్లాస్టిక్ పడేసిన ఐదుగురికి జరిమానా

ఏటూరునాగారం, జూన్ 1 : ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలోని ఎక్కెల సెక్షన్ అడవిలో మద్యం తాగుతూ ప్లాస్టిక్‌ను పడేసి, పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న ఐదుగురు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసి, రూ.15వేలు జరిమానా విధించినట్లు రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గోపాగాని సృజన్, పైడాకుల ఆంజనేయులు, గుత్తికొండ సందీప్, ఉప్పాల వెంకటేశ్, సామ వంశీ మద్యం తాగుతూ ప్లాస్టిక్‌ను అడవిలో పడేస్తూ అటవీ చట్టాలను ఉల్లంఘిస్తున్నందుకు కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నారాయణ, ఎఫ్‌బీవో కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'వైద్యం పేరుతో ఆర్ఎంపీల నిలువు దోపిడీ'

మహదేవపూర్, జూన్ 1 : మండలంలో పలువురు ఆర్ఎంపీలు వైద్యం పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ ఆరోపించారు. విచ్చలవిడిగా ఆర్ఎంపీలు పుట్టుకొచ్చారని, ప్రాథమిక వైద్యం చేయాల్సిన వారు స్థాయిని మించి గ్రామాల్లో వైద్యం చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆర్ఎంపీలపై ప్రభుత్వ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

మహదేవపూర్, జూన్ 1 : బైక్ అదుపుతప్పి పడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అంబట్‌పల్లి ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని బెగ్లూర్ గ్రామానికి చెందిన అవుసుల సదానందం అంబట్‌పల్లి నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో అంబట్‌పల్లి ఎల్‌టీ ఆఫీస్ ప్రధాన రహదారి వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో సదానందం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సమీపంలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

'చలో ఖమ్మం' పోస్టర్ ఆవిష్కరణ

మల్హర్, జూన్ 1 : లంబాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న ఖమ్మంలో నిర్వహించే సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం మండలంలోని ఆడువాలపల్లిలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సమ్మయ్య ఆవిష్కరించారు. లంబాడీ హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అజ్మీరా సమ్మయ్యనాయక్, బాలాజీ, బా నోత్ రాజేందర్, అజ్మీరా శంకర్, సమ్మయ్య, రాజు, భూక్యా నాయక్, కృష్ణ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్, నందునాయక్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వాచ్‌మన్ మృతి

మహదేవపూర్, జూన్ 1 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తుంగల లస్మయ్య ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఎన్నో ఏళ్లుగా సంఘంలో వాచ్‌మన్‌గా ఆయన పనిచేస్తూ అందరి మన్ననలు పొందాడు. లస్మయ్య మృతి తీరని లోటని చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి అన్నారు. ఆయన మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలి

గణపురం, జూన్ 1 : రేషన్ షాపుల్లో సన్న బియ్యాన్ని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా అందించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ సూచించారు. ఆదివారం మండలంలోని పలు రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు నెలల కోటాకు సంబంధించి బియ్యం పంపిణీ చేసే విషయంలో డీలర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల కోటాను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అలాగే, డీలర్లు సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ బియ్యం అందించాలని సూచించారు. అవకతవకలు, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ-పాస్ స్లిప్పులను పరిశీలిస్తున్న డీసీఎస్‌వో

యువకులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

వాలీబాల్ కిట్ అందజేస్తున్న ట్రైనీ ఎస్సై

మంగపేట, జూన్ 1 : మండల కేంద్రంలోని పొదుమూరుకు చెందిన యువకులకు ఆదివారం ట్రైనీ ఎస్సై నరేశ్ వాలీబాల్, క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులు, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల సురేశ్, వాడబలిజ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కలాల రాంబాబు, యూత్ బృందం ఏట్ల అశోక్, గగ్గురి మహేశ్, ఎర్రావుల సమ్మయ్య, లక్ష్మణ్, పానెం మదనయ్య, తిప్పని శ్రావణ్, వెంకటేశ్, రఘు, రాజు, బద్ది పాపారావు, కృష్ణ పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న ఐదుగురిపై కేసు

ములుగురూరల్, జూన్ 1 : అక్రమంగా పశువులను తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు గూడ్స్ వాహనాలు ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు అనుమానాస్పదంగా వస్తుండడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. అందులో అక్రమంగా 13 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలిందని తెలిపారు. పట్టుకున్న రెండు ఆవులతో పాటు 11 ఎద్దులను గోశాలకు తరలించి, పశువులను తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు మొండిచేయి

పైసలిస్తేనే లిస్టులో పేరు

రేగొండ, జూన్ 1 : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులకు అన్యాయం జరుగుతున్నట్లు గ్రామాల్లో ప్రచారం జోరందుకుంది. అనర్హులు, కాంగ్రెస్ నాయకుల బంధువులకు మాత్రమే చోటు దక్కినట్లు తెలుస్తున్నది. ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అధికారులు సర్వే నిర్వహించి అర్హుల లిస్టు తయారు చేశారు. చివరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతిపాదించిన వారికి మాత్రమే అనే నిబంధనలు అమలు చేయడంతో అర్హులకు అన్యాయం జరుగుతున్నది. కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లలో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ప్రచారం జరుగుతున్నది. త్వరలో లబ్ధిదారుల లిస్టు రానుండడంతో గ్రామస్థాయి చోటామోటా నాయకులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. లిస్టులో పేరు వచ్చేలా చేస్తామంటూ అందినకాడికి దండుకుంటున్నారని సమాచారం.

రేగొండ మండల కేంద్రంతోపాటు భాగిర్థిపేట, మడుత్తపల్లి, పోచంపల్లి, కనిపర్తి, జగ్గయ్యపేట, తిరుమలగిరి, చిన్నకోడెపాక, సుల్తాన్‌పూర్, చెన్నాపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ వసూళ్లకు తెరలేపారని తెలిసింది. ఈ క్రమంలో డబ్బుల పంపకంలో నాయకుల మధ్య గొడవలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ విషయం బయటకు రాకుండా మండల స్థాయి నేతలు వారి మధ్య సయోధ్య చేశారు. ఏది ఏమైనప్పటికీ ఇందిరమ్మ జాబితా వెలువడిన తరువాత గ్రామాల్లో ఘర్షణ వాతావరణం జరుగనున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

అర్హులకు న్యాయం చేయాలి..

రేగొండ మండలంలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు తీసుకొని అనర్హులకు ఇళ్లు కేటాయించారు. ఇందిరమ్మ కమిటీలు పంపిన లిస్టులో చాలా మంది అనర్హుల పేర్లు పెట్టినట్లు తెలిసింది. అధికారులు స్పందించి రీసర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలి. మండలకేంద్రంతోపాటు భాగిర్థిపేట తదితర గ్రామాల్లో ముడుపులు తీసుకొని లిస్టులో పేర్లు పెట్టినట్లు తెలిసింది. వారిపై చర్యలు తీసుకోవాలి.



కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటు బ్యాంకు రాజకీయాలతోపాటు బంధుప్రీతి, డబ్బులు తీసుకొని అర్హులకు అన్యాయం చేయడం సరికాదు. అధికారులు సర్వే చేసిన పేర్లు లిస్టులో లేవు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి అర్హులకు న్యాయం చేయాలి.

- పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వినయ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347.
NTW-337079

WANTED

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565